క్లుప్తంగా

నూతన జంటను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బాలినేని



నూతన జంట, వారి కుటుంబంతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఇటీవలే మూడుముళ్ల బంధంతో ఒకటైన జంటను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి ధూళిపూడి ప్రసాద్ కుమార్తె ఆశ ప్రియాంకకు ఇటీవలే హర్షవర్ధన్‌తో వివాహమైంది. స్థానిక భాగ్యనగర్‌లోని ప్రసాద్ ఇంటికి బాలినేని చేరుకుని నూతన జంటను ఆశీర్వదించారు.

రజకుల గర్జన సభను జయప్రదం చేయాలి



రజక సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

ఒంగోలు టౌన్: రజకుల న్యాయమైన హక్కుల సాధన కోసం డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న రజకుల గర్జన సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘ జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నప్పటికీ రజకులు సామాజిక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు రజకులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు సామాజిక రక్షణ కలగా మిగిలిపోయిందన్నారు.ఈ నేపథ్యంలో రజకుల సామాజిక రాజకీయ చైతన్యం కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రజక సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు కోటేశ్వరరావు, రమణమ్మ, కృష్ణయ్య, మంచికలపాటి శ్రీనివాసరావు, కొండయ్య, యోగమ్మ, యానాదరావు, పోలయ్య, వెంకటనారాయణ, కాకర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఒంగోలు సెంట్రల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 20వ తేదీ ఒంగోలులోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.



ఒంగోలులో నాగేంద్రస్వామికి పూజలు చేస్తున్న మహిళలు



భక్తులతో రద్దీగా సంతపేట సాయిబాబా ఆలయం



ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో నాగేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



ఒంగోలులోని రంగారాయుడిచెరువు వద్ద పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు



కరవదిలో అలంకరణలో నాగేంద్రస్వామి పుట్ట

ఒంగోలు రూరల్:

నాగులచవితి పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఒంగోలు నగరంలో, మండలంలోని గ్రామాల్లో గల దేవాలయాల్లో వేంచేసి ఉన్న నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల్లో గల నాగేంద్రస్వామి పుట్టల వద్ద పాలు పోసేందుకు మహిళలు బారులుదీరారు. కరవది గ్రామంలోని చెరువుకట్టపై ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒంగోలు నగరం, మండలంలోని భక్తులు పెద్ద ఎత్తున బారులుదీరి నాగేంద్రస్వామికి పాలు పోశారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకుని సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేశారు. ఉదయం నుంచే పుట్టల్లో పాలు పోసి పూజలు నిర్వహించారు. ఉపవాసం ఉండి మొక్కులు చెల్లించారు. పుట్టచుట్టూ పువ్వులు, పసుపు, కుంకుమ, దారంతో విశేషంగా అలంకరించారు. నూతన దంపతులు పుట్టదగ్గరకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్ట దగ్గర వండిన పొంగళ్లతో ప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

చీమకుర్తి: సంతనూతలపాడులోని నాగేంద్రస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో పూజలు చేస్తున్న భక్తులు



కరవదిలో విద్యుత్ దీప కాంతులతో అలంకరించిన నాగేంద్రస్వామి ఆలయం



పూజలు చేస్తున్న బాలినేని శచీదేవి

నాగులచవితి పూజల్లో పాల్గొన్న బాలినేని శచిదేవి, శిద్దా కుటుంబీకులు



పూజలు నిర్వహిస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు



నాగేంద్రస్వామి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు

ఒంగోలు మెట్రో: నగరంలో నాగులచవితి పూజలను శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి పంచముఖ నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యుడు కుర్రా ప్రసాద్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల నాగేంద్రస్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న సర్పంచ్ పుల్లయ్య

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామానికి చెందిన కసుకుర్తి శ్రీను మూత్రపిండ వ్యాధితో మృతి చెందడంతో ఆయన భార్య సునీతకు స్థానిక సర్పంచ్ ఎస్.పుల్లయ్య చేతుల మీదుగా వైఎస్సార్ బీమా నగదులో తొలి విడత మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను శుక్రవారం అందించారు. మిగిలిన నగదును త్వరలో అందిస్తామన్నారు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరఫున అండగా ఉంటామని సర్పంచ్, స్థానిక నాయకులు భరోసా ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు రూరల్: మండలంలోని మండువవారిపాలెంలో ఒరిగిపోయిన, పాతబడిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏఈ ఆర్ఆర్ చెన్నారెడ్డి తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ ఆధునికీకరణ చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. శుక్రవారం ఉదయం కరవదిలోని సచివాలయం సమీపంలోని పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఏఈ తెలిపారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకురాలు రోహిణి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండు రోజులుగా విద్యార్థులకు పుస్తకాల ఆవశ్యకత గురించి తెలిపి కథలు చదివించామన్నారు. వారి చేత నీతి కథలు చెప్పించామని తెలిపారు. శనివారం చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని, ఆదివారం ఆటల పోటీలు నిర్వహిస్తామని, ఈ నెల 20వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందిస్తామని వివరించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలని స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తపట్నం గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు.



ఏడుగుండ్లపాడులో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో గ్రంథపాలకురాలు రోహిణి

ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లి చదువుకున్న వారు ఎంతో తెలివితేటలు కలిగి ఉంటారన్నారు. గుండ్లకమ్మ మీద ఒక కవితను వివరించారు. గ్రంథాలయం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు, ఎంపీయూపీ స్కూల్ చైర్మన్ ఎస్‌కే మస్తాన్‌వలి, ఉపాధ్యాయుడు శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

ఒంగోలు రూరల్: అందరికీ మెరుగైన వైద్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కరవది పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎస్.వాణి అన్నారు. మండలంలోని కరవది పీహెచ్‌సీ ఆధ్వర్యంలో యరజర్ల గ్రామంలో ఫ్యామిలీ హెల్త్ కాన్సెప్ట్ శిబిరాన్ని శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ రాములమ్మ, కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ వాణి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో కృష్ణారెడ్డి, ఫార్మసిస్ట్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్యామిలీ కాన్సెప్ట్ శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

రబీ సాగుకు సాగర్ నీరు లేదు

- కేవలం తాగునీటికే సాగర్ జలాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు నిర్ణయం
- ప్రత్యామ్నాయ నీటి వనరులతో పంటలు సాగు చేసుకోవాలి
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పాల్గొన్న రవీంద్రారెడ్డి, ప్రసాదరెడ్డి

ఒంగోలు అర్బన్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి రబీ సాగుకు ఈ ఏడాది సాగునీరు విడుదలయ్యే అవకాశం లేదని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. రబీ పంటలు సాగు చేసే రైతులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ నీటి వనరులతో తగిన పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షతన ప్రకాశం భవనంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని కృష్ణానది యాజమాన్య బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. అందువలన సాగర్ ద్వారా ఈ ఏడాది రబీకి నీరు విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. మీడియం ప్రాజెక్టులైన కంభం, మోపాడు రిజర్వాయర్ల ద్వారా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక పరిస్థితులపై ఆధారపడి రబీ సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డుదారులకు లక్ష్యం మేరకు పంట రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ ద్వారా ప్రభావవంతంగా సాగు జరుగుతున్న వివరాలు కూడా సేకరించాలన్నారు. రబీ సీజన్‌లో స్థానికంగా మూడు ప్రధానమైన పంటల సాగులో నూతన విధానాలను అమలు చేసేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు రూపొందించి నివేదిక అందజేయాలన్నారు. బహుళ పంటల సాగు విధానాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

వ్యవసాయ సలహామండలి చైర్మన్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులు డిమాండ్ చేస్తున్న విత్తన రకాలను ముఖ్యంగా కాగ్-2 రకం శనగల సరఫరాను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ సీజన్‌కు ముందుగానే ఈ విధమైన ఇండెంట్‌ను ప్రభుత్వానికి పంపాలన్నారు. డిమాండ్ ఉన్న జేజే-11 రకానికి ప్రత్యామ్నాయ రకాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. డీకే పట్టా భూములను కూడా త్వరగా ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలు రబీసాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల్లో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలోని పరిస్థితులకు తగినట్టుగా రైతుల అవసరాలు తీర్చడంపై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గొర్రెలు, మేకల ఆరోగ్య సంరక్షణ కార్డును కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, ఉద్యానవన అధికారి గోపీచంద్, ఆత్మ పీడీ అన్నపూర్ణ, పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుమలత, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, సెరీకల్చర్ అధికారి సుజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం



అంజయ్యకు ఆర్థికసాయం అందిస్తున్న వారా వీర్రాజు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం ఎస్సీకాలనీలో విద్యుదాఘాతంతో గాయాలపాలైన వ్యక్తికి జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. దాసరి అంజయ్య అనే వ్యక్తి వ్యవసాయ పనులు చేస్తూ పొలంలో కరెంటు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు శుక్రవారం మల్లవరంలోని అంజయ్య ఇంటికి చేరుకుని పరామర్శించారు. జగనన్న ఫౌండేషన్ ద్వారా ఆ కుటుంబానికి ఆర్థికసాయం చేసి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

ఘనంగా విశ్వకళాభారతి వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

ఒంగోలు మెట్రో: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విశ్వకళాభారతి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దగ్గుపాటి శివ అనూష దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, విశ్వకళాభారతి అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ చేస్తున్న సాహిత్య కృషిని అభినందించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యుడు చుంచు చలమయ్య హాజరై మాట్లాడారు. ఎంవీఎస్ శాస్త్రి, దగ్గుపాటి వెంకట్రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి, ఉప గ్రంథ పాలకురాలు బి.కోటేశ్వరి తదితరులు పాల్గొని ప్రసంగించారు. కవిబ్రహ్మ తిక్కనకు పద్య పుష్పార్చన పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పద్య కవులు నారాయణం బాలసుబ్రహ్మణ్యం, ఎం.నాగకుమారశర్మ, డి.రామాచార్యులు, డి.వి.ఎం.సత్యనారాయణ, మాగంటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొని పద్య నీరాజనం సమర్పించారు. గో వృషభ విలాపంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లెళ్ల వరప్రసాద్, కప్పగంతు జయరామయ్య, పింగళి పూర్ణచంద్రరావు, పాలూరి శివప్రసాద్, నెమ్మాని సీతారామమూర్తి, చుండూరి శ్రీనివాసులు, ఆళ్ల సుబ్బారెడ్డి, కె.ఝాన్సీ తదితరులు పాల్గొని కవితా గానం చేశారు. అతిథులను, కవులను ఘనంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఉద్యమాలు చేసిన వారిని స్మరించుకోవాలి

ఒంగోలు మెట్రో: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నాలుగో రోజు గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వయోజన విద్యా ఉప సంచాలకులు పి.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వీక్షించారు. గ్రంథాలయ వ్యవస్థ కోసం ఉద్యమాలు చేసిన ప్రముఖులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని వారు పేర్కొన్నారు.

వ్యర్థాల నిర్వహణకు సాంకేతిక సహకారం జోడిద్దాం

- జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ విజయలక్ష్మి

ఒంగోలు: వ్యర్థాలను నియంత్రించి తిరిగి వినియోగించుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఇందుకు సంప్రదాయ విధానం స్థానంలో సాంకేతిక సహకారాన్ని జోడించడం ఉత్తమ మార్గమని జేఎన్‌టీయూ హైదరాబాద్ బోర్డు ఆఫ్ స్టడీస్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ చైర్మన్ టి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన రెండోరోజు అంతర్జాతీయ సెమినార్‌లో ఆమె మాట్లాడారు. చాలా వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలివేయకుండా రీసైక్లింగ్ చేసి మళ్లీ వినియోగించుకునేలా చేయాల్సిన అవసరాన్ని నేడు సమాజం గుర్తించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు ప్రతిఒక్కరూ దీనిపై దృష్టిసారించారన్నారు. సెమినార్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ ఎన్విరాన్‌మెంటల్ జియాలజీ డైరెక్టర్ పి.మధుసూదనరావు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జె.కోటేశ్వరరావు, ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఇందిరాప్రియదర్శిని న్యాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఏపీటీజీ అధ్యక్ష, కార్యదర్శులు

ఒంగోలు సెంట్రల్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి కోరారు. 2021 మార్చి నుంచి ప్రభుత్వంలో విలీనమైన 200 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు జీవో నంబర్ 50 ప్రకారం జిల్లా విద్యాశాఖాధికారి జెడ్పీ సీఈఓకి పీఎఫ్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చే అన్ని రకాల టెర్నింగ్ ఎక్విప్‌మెంట్స్, టీవీ వంటివి ఇవ్వాలని కోరారు. పలు సమస్యలపై ఏడీ వాణిని కలిసి వినతిపత్రం అందించారు.